# ఎచటికి పోతావీ రాత్రి

5

ఎన్నిసార్లు గుచ్చిగుచ్చి అడిగినా అదే సమాధానం ! చావు తెలివి అంటే ఇదేనేమో!

"ఎందుకట్లా చెప్తావు? వున్న సంగతి చెప్పు. నువ్వెట్లాగు చనిపోతున్నావు. ఇంకెందుకు భయం. ఉన్న సంగతి చెప్పెయ్. ఫరవాలేదు. ధైర్యం తెచ్చుకో"

మళ్ళీ అదే సమాధానం. ఎక్కడో నూతి లోంచి

"చచ్చేదాన్ని ఎందుకమ్మా అట్లా వేధిస్తారు! ఇప్పుడైనా శాంతిగా వుండనివ్వరా! శాంతిగా చావనివ్వరా!" ఒక పెద్దావిడ.

మా! తుఝే సలాం. చాలా బాగా చెప్పావు. బ్రతుకులో చావులో శాంతి పరిరక్షణే కదా మన ధ్యేయం!

జీర్ణం, జీర్ణం హత్యలు జీర్ణం. అవమానాలు జీర్ణం, అత్యాచారాలు జీర్ణం. అన్నింటికీ కప్పేద్దాం తెల్లదుప్పటి. అందుకుందాం అటాప్సీ రిపోర్ట్. అయిపోయింది మరణవాంగ్మూలం. చాలా సింపిల్. కడుపు నొప్పి భరించలేక చనిపోవడం.

చేతులు కడిగేసుకునిపోదాం. అలవాటేగా మనకిలా రోజుకి రెండో మూడో శవాల్ని అప్పగించు కోవడం.

గుండెతోపాటు ఎండ కూడా మండుతోంది. జనాభాలో సగంమందికి నిస్పహాయత! మరో సగంమందికి నిర్లిప్తత! ఎవరెటుపోతే మనకేం. మన జీతాలు, మన ఆదాయాలు మన కొస్తున్నాయి. ఛోడ్ దో ఏ సబ్ బాతోంకో. నేనే నా మార్గం. నేనే నా గమ్యం.

ఇంటి తాళం తీసే వుంది. సుపుత్రుడు ఇంటికి వచ్చి కూర్చున్నాడు టీవీ ఎదురుగా ముఖం మాడ్చుకుని. హక్కుల పోరాటం సాగిస్తున్నాడు. నాకూ అలాగే కుర్చీలో చేరబడిపోవాల నుంది. కానీ వంటికి పట్టిన మృత్యువాసన కడుక్కోవాలిగా! ఎంత సబ్బు నురగ పట్టించినా, ఎన్ని నీళ్ళు గుమ్మరించుకున్నా పోవడంలేదు. శరీరంలో నుంచీ పుట్టుకొస్తుంది. అడుగంటా పట్టిపోయింది. లోలోపలికి ఇంకిపోయింది. మన దగ్గర అరేబియా పెర్ఫ్యూమ్స్ లేవు కదా!

"పద నాన్నా! భోజనం చేద్దాం" అన్నాను.

"ఏం భోజనంలే అమ్మా! రోజూ అవేగా. నువ్వు చేసే వంటలు తినీ తినీ బోర్ కొట్టేసింది. సతీష్ వాళ్ళమ్మ రోజుకొక రకం చేస్తుంది. నీకు తీరదుగా. కోర్టులు, ఆస్పత్రులు, ఆడ వాళ్ళు" ఈమధ్య రమణ కూడా కొంచెం ఇలాగే మాట్లాడుతున్నాడు. వీడు అనుకరించడంలో అందె వేసిన చెయ్యి.

ఆరోగ్యంగా బ్రతకడానికి ఏం తినాలో చెప్పిచెప్పి విసుగొచ్చింది. ఏదో చెప్పబోతుంటే "సరే! పద తినేద్దాం. మరి నేను అడిగింది ఏం చేశావ్!" అన్నాడు తినడం నన్ను ఉద్ధరించడానికి లాగ.

"అదా! సాయంత్రం నాన్నొచ్చాక ఆలోచిద్దాం" అన్నాను.

"కొన్నింటికేమో ఆడవాళ్ళకి నిర్ణయించే హక్కుండాలి అంటావు. నీకిష్టం లేకపోతేనేమో నాన్న మీదికి నెడతావు. తెలివి" నిండా పదమూడేళ్ళు లేని ఈ పసివెధవకి యింత చనువిచ్చి పెంచడం తప్పేమోనని ఎప్పుడూ ఆలోచించలేదు.

"నాకింతవరకూ ఒక్క పుట్టినరోజైనా చేశావా? మా ఫ్రెండ్స్ ప్రతి సంవత్సరం ఎంతో గ్రాండ్‌గా చేసుకుంటారు. ఎన్ని బహుమతులో వాళ్ళకి"

"సాయంత్రం ఆలోచిద్దాం అన్నానుగా. అన్నం తినెయ్"

"సరే నాన్నతో చెప్పి నువ్వే ఒప్పించాలి మరి. నేను సతీష్ వాళ్ళింటికి వెళ్ళొస్తా"

, గబగబ అన్నం తినేసి పరిగెత్తాడు. సతీష్ కంప్యూటర్ కొన్నాక వాళ్ళిల్లు వదలడం లేదు వీడు.

నీరసంగా అనిపించి మంచం మీద వాలితే కన్నీళ్ళు తన్నుకు వచ్చాయి. ఏం చెయ్యలేక పోతున్నాం. ఎందుకని? మనవల్ల ఏమీ కాదా?

కడుపునొప్పికి మందు కనిపెట్టలేకపోతున్నాం సరే! కనిపెంచిన ఈ పసివెధవకి కూడా నచ్చజెప్పలేకపోతున్నానెందుకని?

కాలింగ్ బెల్ మోగింది.

రమణ దృష్టిలో నాది క్షణం తీరిక దమ్మిడి ఆదాయం లేని పని.

వచ్చింది పద్మలత. మా 'చేయూత' ఉప కార్యదర్శి.

"ఒకావిడెవరో కౌన్సిలింగ్ కోసం వచ్చింది. ప్రొద్దున రజని రాలేదు. సాయంత్రం నాలుగింటికి రమ్మన్నాను. కాస్త నువ్వొచ్చి ఆవిడ చెప్పేది విను. ఏమిటలా వున్నావ్!" అంది.

"సుశీల పోయింది. ప్రొద్దున వాంగ్మూలం యిచ్చింది. మామూలే" పద్మ పెదవి విరిచింది.

"మన కౌన్సిలింగ్ వల్ల ఏ లాభమూ కనిపించడంలేదు. దండగేమో అనిపిస్తుంది."

"నిరాశపడి ఏం చేస్తాం. మన పని మనం చెయ్యాలిగా. సరే నాలుగింటికి ఆఫీస్ కొచ్చెయ్" అని వెళ్ళిపోయింది. ఎంతో ఆవేశంతో, ఆవేదనతో వస్తారు. కడుపులో వున్నదంతా చెప్పేస్తారు. కంటికి కడివెడుగా ఏడుస్తారు. కానీ భయం. ఏం చెయ్యడానికీ భయం. చివరికిలా ప్రభుత్వ ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో తేలి మరణవాంగ్మూలాలు చాలా జాగ్రత్తగా యిచ్చి మంచిదనిపించుకుంటారు. చావులు - చావులు, తల్లులు - పిల్లలు - కుటుంబాలు. చావో బ్రతుకో కుటుంబ పెద్దే నిర్ణయిస్తాడు.

కూటికోసం, గూడుకోసం అలమటించి అప్పులు. కలర్ టీవీలకి, ఫ్రాస్ట్ ఫ్రీ ఫ్రిజ్‌లకి అప్పులు. కట్నాలకి, లాంఛనాలకి అప్పులు. చివరికి పురుగుల మందులు. వేధింపులు, అనుమానాలు, అవమానాలు, చావులు. రమణా వెక్కిరించకు ప్లీజ్! నాకు తెలుసు నా ఒక్కదానివల్ల ఏమీ కాదని. నాకు ఇది కూడా తెలుసు. నాకన్నా కష్టపడేవాళ్ళు, ఆలోచించే వాళ్ళు చాలామంది వున్నారని. వెక్కిరింపు నేను భరించలేను. దయచేసి ఆపు.

ఆవిడొచ్చింది నాలుగింటికి. ఆవిడ మీద జరిగేది భౌతికహింస కాదు. ఆవిడ పేరు ప్రియంవద. మానసిక చిత్రవధ అనునిత్యం. బయటికి కనపడని హింస. మాటలు, కంపుకొట్టే మాటలు. యాసిడ్‌లో ముంచిన బాణాలు. గుండెకి చిల్లులు పొడుస్తూ. గాయాల మీద గాయాలు చేస్తూ. ఒక్కొక్కసారి పేడ ముద్దలు ముఖానికేసి కొట్టినట్లు, ఒక్కొక్కసారి అజీర్ణ రోగి ఆవిడ మొహం మీద వాంతి చేసుకున్నట్లు. ఎప్పుడూ సల్ఫర్ డయాక్సైడ్ పీలుస్తూ చావుకి దగ్గరగా.

ఎలా వున్నావు మరి ఇన్నాళ్ళు.

పిల్లలు - చదువులు - కుటుంబం - పరువు - డబ్బు - ఇప్పుడు పిల్లలు పెద్దయ్యారు. వాళ్ళు కూడా పట్టించుకోడం లేదు.

విడాకుల చట్టం వుందిగా!

ఆడపిల్లలకి పెళ్ళి కావాలి.

తన దగ్గర డబ్బు లేదు. అయినా ఏ కారణంతో యివ్వను.

అతను మందిలో ఒక మనిషి. నాకు మరో మనిషి. రాత్రొక మనిషి. పగలొక మనిషి. ఏం చేస్తావమ్మా మరి!

ఆ మనిషిని మార్చే ఉపాయం చెప్పండి. పేడని గులాబిపువ్వులా మార్చే మంత్ర దండాలేవీ లేవు. కడిగేసుకుని దానికి దూరంగా ఉండడమో లేక రోజు రోజూ భరిస్తూ వుండడమో! అతను లేని బ్రతుకంటే భయం, అతనితో బ్రతుకూ భయమే! కడుపులో కాగడాతో కెలికినట్లు!

రజని వచ్చింది. మా సంస్థలో తనే ఫ్యామిలీ కౌన్సిలింగ్ చేస్తుంది. చాలా ఓర్పు. ఆమెకి అప్పగించి వరండాలో కూర్చున్నాను.

హాట్ ఫ్లాషస్ లాగ వొళ్ళంతా ఆవిర్లొచ్చాయి. ముప్పై అయిదేళ్ళకే మెనోపాజ్ లక్షణాలు. శక్తి వుడిగిపోతున్న లక్షణాలు. నరాలు ఒకదానికొకటి అంటుకుని మంటలు పుడుతున్నట్లు, వొళ్ళంతా చిటపటలాడిపోతోంది. కడుపులో మంట. మందులకి లొంగని మంట. జైనెటాక్ - ఓమెజ్ పారేయ్ అన్నీ చెత్తబుట్టలో. లోపల ప్రియంవద ఏడుపు - రజని ఓదార్పు - ప్రియంవధ - చీకటి ముసురుతోంది.

మబ్బులు కూడా ముసురుకొస్తున్నాయి. కాలంకాని కాలంలో ఈ మబ్బులేమిటో! ప్రియంవద భుజం మీద చెయ్యివేసి రజని బయటికి వచ్చింది. గుమ్మంలో నిలబడి అనునయించింది. ఎట్టి పరిస్థితుల్లోను ఆత్మహత్యకు పూనుకోనని మాట యివ్వమంది. నీకు మేం ఉన్నాం అంది. సుశీలతోనూ ఇలాగే అంది. ప్రియంవదకి వాళ్ళాయన్ని మార్చే మంత్రం కావాలి. ఏడవలేక నవ్వుకున్నాం ఇద్దరం. మబ్బులు ముసరడంతోపాటు గాలి కూడా మొదలైంది. వర్ష సూచన. ఇంటికొచ్చి మెట్లెక్కుతోంటే అమ్మ గొంతు ఖంగున వినపడుతోంది. పుట్టిల్లు ఊళ్ళోనే వుండడంలో లాభాలెన్ని వున్నాయో నష్టాలూ అన్నే వున్నాయి.

"మీ అమ్మకి కూడా వాళ్ళ తాతకి మల్లే ఇల్లు పట్టదు. మా నాన్న కూడా ఇంతే. పార్టీ పార్టీ అని ఇల్లు పట్టకుండా తిరిగేవాడు" బహుశా నా కూతురుతో కాబోలు అంటోంది.

అవును నేను వెంకట్రామయ్యగారి మనవరాల్ని. నా ఇల్లు, నా పిల్లల్ని చూసుకుంటూ కాస్త నాకు నచ్చిన పని చెయ్యగలుగుతున్నాను. నాకూ ఆయనకీ పోలికా? ఆయన జైలుకిపోతే మా అమ్మమ్మ ఇంటినీ, పిల్లల్నీ, పాలాళ్నీ చూసుకుంది. ఆయన్ని గొప్ప హీరోలా అభిమానించి సహకరించింది.

ఆవిడ యవ్వనం, ఆవిడ ఓపిక అన్నీ ఇల్లు నిలబెట్టడానికి వెచ్చించింది. ఓ గొప్ప వ్యక్తిగా ఈనాటికీ గౌరవం పొందుతున్న మా తాత వెనుక ఆవిడ వుంది. నా వెనుక ఎవరున్నారు? ఎక్కడికి వెళ్ళినా వంటవేళకి ఇల్లు చేరాలి. పిల్లల హోమ్‌వర్క్‌లు కూడా చూడాలి.

"మీ నాన్న అలా తిరిగితే మీ అమ్మ మిమ్మల్ని పెద్ద చేసింది. మరి నాకెవరమ్మా?" అన్నాను రోషంగా, విసురుగా.

"సంతోషించాంలే. మనకి పాలుపోసే అబ్బాయి జున్ను పాలు తెచ్చాడు. ప్రొద్దున రమణ కిష్టం అని బాగా మిరియాలు, యాలక్కాయలు వేసి తెచ్చాను. వచ్చా కదాని నా మనవరాలికి తలంటుపోశాను. ఈ పూటికి వంట కూడా చేసిపెట్టాను. వానొచ్చేలా వుంది. ఇక నే వెడతా. మీ నాన్న కంగారుపడతారు"

అమ్మ డైలాగ్‌కి అవకాశం ఇవ్వదు. ఎంతసేపూ మోనోలాగ్సే.

"ఇలా అందరికీ అన్నీ అందించడం ఇంక మానెయ్యమ్మా పెద్దదానివయ్యావు" అని ఎంత చెప్పినా వినదు. భారతీయనారి. నేనూ ఇలాగే అయిపోతానా? అనుకుంటే వెన్ను జలదరించింది.

"నీ సిద్ధాంతాల కోసం ఆ పసివెధవ మనస్సు నొప్పించకు. ఒక పుట్టినరోజు వేడుక చేస్తే ఏం నష్టం లేదు. నీ దగ్గర డబ్బు లేకపోతే నేనిస్తాలే" అంది మరో అయిదు నిమిషాలకి మెట్లు దిగుతూ.

"దేనికీ కొరగాని ఈ సేవలు మానేసి రమణ చెప్పినట్లు విను. దర్జాగా బోలెడు జీతం" అనేసి నా మొహం చూడకుండా వెళ్ళిపోయింది.

నీ కొడుకు చెప్పినట్లు విను, మీ అమ్మ చెప్పినట్లు విను, నీ మొగుడు చెప్పినట్లు వింటూ పో. సున్తే జావ్! ఇస్‌మే హై తుమ్హారీ భలా.

కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ మెరుపులు. కిటికీ తలుపులు విసురుగా కొట్టుకుంటూ గాలి. ఉండీ ఉండీ ఉరుములు. బంగాళాఖాతంలో అకస్మాత్తుగా వాయుగుండం పడిందో ఏమో!

"బ్యాటరీ లైటు ఎక్కడుంది? ఎమర్జెన్సీ లైటు ఛార్జి అయి వుందా? అంటూ గృహ ప్రవేశం చేశాడు రమణ. అతని వెనకే వారసుడు.

రమణకి ఈమధ్య ముందుచూపు జాస్తి అయింది. కరెంట్ పోయాక ఒకర్నొకరు 'ఢీ' కొట్టుకుంటూ చీకట్లో తడుముకుని అగ్గిపెట్టె వెతుక్కుని క్యాండిల్ వెలిగించుకోవడంలో 'భలే థ్రిల్' వుందనేవాడు పూర్వం. ఇపుడు కాస్త గాలి కొడితే చాలు కరెంట్ పోతుందని భయం.

"నాన్న వచ్చాడుగా ఇప్పుడు చెప్పు, పుట్టినరోజు సంగతి" అని మళ్ళీ మొదటికొచ్చాడు కొడుకు.

"అవున్రా రవీ నీ పుట్టినరోజు మే నెలలో కదా! ఇప్పుడు చేసుకుంటానంటా వేమిటీ?" రమణ విసుగ్గా.

"మే నెలలో వేసవి సెలవులు. ఎవరూ ఊళ్ళో వుండరు. వున్నా ఇంటింటికీ వెళ్ళి పిలవడం కుదరదు. ఇప్పుడయితే స్కూల్‌లోనే అందర్నీ పిలిచెయ్యొచ్చు. పైగా పీయూష్ వాళ్ళక్క ఇప్పుడు ఇక్కడుంది. ఆవిడైతే పార్టీ చక్కగా అరేంజ్ చేస్తుంది. ఆవిడుండగానే చేసుకోవాలి. అసలు అమెరికాలో ఎవరికి తీరికున్నప్పుడు వాళ్ళు పార్టీలు పండుగలు చేసు కుంటార్ట. అసలు రోజునే చేసుకోరు. ఈసారి నేను గ్రాండ్‌గా చేసుకోవాలి"

"గ్రాండ్‌గా అంటే ఎలా?"

"మొన్న పీయూష్ బర్త్‌డే పార్టీకి నువ్వూ వచ్చావుగా చూడలేదా?"

ఏమిటి ఆ కాగితం తోరణాలు! ఆ బల్బుల అలంకరణలు. పిల్లలకి టోపీలు, అంత పెద్ద కేకు. బూరలు, ఈలలు, స్వీట్లు, చాక్లెట్లు, పాటలు, ఆ లెవల్లో కావాలన్నమాట పుట్టినరోజు..

"ఎంతవుతుందిరా నాన్నా?"

"మంచి డ్రెస్ కొనుక్కోవాలా? పైన ఇదంతా వుందా? ఓ అయిదారు వేలవదా?"

"అమ్మో! అయిదారువేలే! అయిదారువేలతో మనం ఎన్నో మంచి పనులు చెయ్యొచ్చు"

"అవును అసలు పిల్లల్ని కనకపోతే డబ్బంతా కోర్టులకి, దేశసేవకి ఖర్చుపెట్టచ్చు. అవే కదా మంచి పన్లు."

'నోర్మూయ్ వెధవా!' అననందుకు నా సంస్కారాన్ని నేనే అభినందించుకున్నాను.

"సరే ఆదివారం ఇంకా నాలుగురోజులుంది కదా చూద్దాం. పదండి భోజనం చేద్దాం. మళ్ళీ కరెంటు ఉండదు" అని కొడుకు భుజం మీద చెయ్యివేసి టేబిల్ దగ్గరికి నడిపించు కొచ్చాడు రమణ.

వీణ్ణి పీయూష్, సతీష్ వాళ్ళ స్కూల్లో వెయ్యద్దంటే వినలేదు రమణ. అసలు ఈమధ్య ఏం వింటున్నాడు కనుక. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాడు, మారిపోతున్నాడు.

"వాడికైతే అడిగినవన్నీ యిస్తారు. మగపిల్లాడుకదా! నేను గాగ్రాచోలీ కుట్టించుకుంటా నంటే మాత్రం ఒప్పుకోరు" అంది కాంతి గ్లాసుని టేబిల్ మీద గట్టిగా కొట్టి. ఇనప టేబిలూ, స్టీలు గ్లాసు కనక ఫరవాలేదు.

"అదెంతవుతుందిరా కన్నా" అన్నాడు తండ్రి.

"పట్టుదయితే ఓ మూడువేలవుతుందేమో అనూహ్య నడగాలి" అంది.

"మూడు వేలకి అరడజను డ్రెస్‌లు వస్తాయి. గాగ్రాచోలీ అంటే పరిగెత్తడానికి వీల్లేదు. రోజూ వేసుకోవడానికి వీల్లేదు. పెట్టెపూజ" అన్నాను.

"అరడజను డ్రెస్‌లు మాత్రం ఎందుకూ రెండుంటే చాలవూ?" అంది చెంప మీద కొట్టినట్లు.

మారుతున్న కాలంలో పెరుగుతున్న ఈ పిల్ల నెత్తిన నా భావాలు రుద్దడం తప్పేమో! కానీ ఎక్కడ తేలతారు వీళ్ళు !

"ఇదిగో ప్లీడరమ్మా! సుబ్బారావుకి రేపు ఏ సంగతి చెప్పెయ్. ఆరుగురు కాచుకుని కూర్చున్నారు ఆ ఉద్యోగం కోసం. ఏదో స్నేహితుడి భార్యవని కదా నీకోసం కనిపెట్టుకుని కూర్చున్నాడు. రేపు తేల్చకపోతే బావుండదు" అని కొడుకు నడుం చుట్టూ చెయ్యివేసి నిద్రకి పడ్డాడు రమణ. రమణ ఇటీవల కొన్న ఫోమ్ పరుపు అంగారతల్పంలా వుంది.

ఒక చాప రెండు దిళ్ళు, నాలుగు గిన్నెలు, ఒక స్టౌ వుంటే చాలదా మనకి అన్న రమణే! నందనవనంలా మార్చుకున్న ఆ ఇల్లు అమ్మకముందు, ఆ నాలుగు లక్షలూ చేతిలో పడకముందు ఇన్ని కోర్కెలు, ఇన్ని అవసరాలు వుండేవా?

ముప్ఫై ఏళ్ళనాడు మావగారు అతి కష్టంపైన కొనుక్కున్న పెంకుటిల్లు ఆయన పోయాక ఎవరికీ నివాసయోగ్యం కాకుండాపోయింది. అత్తగారు పెద్దకొడుకు దగ్గరికి హైదరాబాద్ వెళ్ళిపోయింది. కప్పునిండా కన్నాలు, పెచ్చులూడిపోయిన గచ్చు, పిచ్చిమొక్కలు అడివిలా పెరిగిన ఆవరణ, అద్దెకొచ్చే దిక్కే కనిపించలేదు, కనీసం పెంకులన్నా కప్పించకపోతే. దానికి పెట్టుబడి పెట్టి బాగుచేయించినందు వలన ఎవరికి లాభం? అని ఆలోచించి ఎవరిమటుకు వాళ్ళే మౌనంగా వుండిపోయినప్పుడు రమణకిక్కడ ఉద్యోగం వచ్చింది. తన బాల్యం గడిపిన ఆ ఇల్లంటే అతనికి ప్రాణం. అప్పుడు దాన్ని యుద్ధప్రాతిపదిక అంటారే అలాగ బాగుచేశాం ఇద్దరం, ఇంకా ఇద్దరు మనుష్యులూ.

పెంకులు కప్పాం. పిచ్చిమొక్కలు పీకేశాం. గచ్చుకి మాసికలు పెట్టాం. వాకిట్లో పూలమొక్కలు, పెరట్లో కూరగాయలు.

అత్తగారొచ్చి చూసి, "మీ నాన్న నాకేం యిచ్చిపోయారు కాదు. ప్రావిడెంటు ఫండు మొత్తం నీ చెల్లెలి పెళ్ళికే సరిపోయింది. ఈ ఇల్లు అద్దెకిస్తే నాకు కనీసం నెలకి మూడువందలైనా వచ్చేవి. బాగుచేయించడానికి నా దగ్గర డబ్బు లేకపోయింది" అంది.

"అదేమిటమ్మా ఆ మూడువందలూ నేను పంపిస్తాలే. నేనూ అద్దెకి వుంటున్నాననుకో" అనేశాడు రమణ.

ఇల్లు బాగు చెయ్యడానికైన అప్పు గాజుల జత అమ్మి తీర్చాం. అయితేనేం అది నిజంగానే నందనవనమే. వేపచెట్టుకి ఉయ్యాల. నేల తడిసిన వాసన ఆఘ్రాణిస్తూ చదివిన

పుస్తకాలు, తెచ్చుకున్న పి.జి. డిగ్రీ. మా ఇద్దరితో వచ్చి చేరిన రవీ, కాంతి. పెరిగిన ఖర్చులు, వాటిని తట్టుకోవడానికి రెండుమూడు కాలేజీల్లో పార్ట్‌టైం ఉద్యోగాలు. సాయంత్రం మళ్ళీ 'లా' చదువు. కాలం గిర్రుగిర్రున తిరిగిపోలేదా? రాత్రులు ఇంత దీర్ఘంగా ఎప్పుడైనా వున్నాయా! 'తెల్లవారకపోతే బావుండును' అని భావుకతతో అనుకున్న సమయాలున్నాయి గానీ నిర్ణయాలు వాయిదా వేయడానికి ఎప్పుడూ కాదు.

రమణకో చిన్న ప్రమోషన్, కొంచెం జీతం పెరుగుదల. నాకు న్యాయవాద వృత్తి పైన పెరిగిన ప్రేమ. ఎన్‌రోల్‌మెంటు. కోర్టుకు వెళ్ళడంతో అప్పుడప్పుడే అర్థం అవుతున్న ప్రపంచం.

అదిగో అప్పుడే -

నేనూ, రమణా వంట ఇంట్లో పిల్లల కోసం 'లవంగలత'లు వండుతున్న సాయంత్రం వీధి వీధంతా కమురు వాసన, కేకలు.

పరిగెత్తి చూద్దును కదా! గుండె అవిసిపోయే దృశ్యం. మూడువంతులు కాలిపోయిన రోజా. రోజా గురించి వీధి అందరికీ తెలుసు. ఎవరూ ఏమీ మాట్లాడరు. మౌనం. ఆ సాయంత్రం లలిత వచ్చింది. సూదులు గుచ్చినట్లు చూసింది. "నువ్వూ, నీ మొగుడు, నీ పిల్లలు, నీ మొక్కలు ఇదేనా జీవితం. అవతలవైపు చూడవా?" అంది.

నాలుగు రోజుల క్రితం లలితగారి 'చేయూత' ఆఫీసుకు వెళ్ళినపుడు 'అవతలివైపు' అర్థం అయింది. మంటలతో పరిగెత్తిన రోజా, ఫ్యాన్‌కి వేళ్ళాడిన మైథిలి, కాలువలో తేలిన సుగుణ - వీళ్ళని గురించి పట్టించుకునే అవకాశం నాకెందుకు లేకపోయింది? అంటే రమణ నవ్వేశాడు.

"ఏం చేస్తావు పట్టించుకుని?"

"ఇక నుంచి చేయూత తరపున కేసులు ఉచితంగా చేస్తాను. నీ జీతం మనకి సరిపోతూనే ఉందిగా"

రమణ వద్దనలేదు. నేను చూడని ప్రపంచం ఎంత వుందో నేను చదవని ఆర్థికశాస్త్రం, చరిత్ర ఎంత వుందో - నాకు తెలియని దృష్టికోణం ఏమిటో అర్థం అవుతోంది.

రమణ అన్నగారమ్మాయి పెళ్ళి కుదురుతోంది. అబ్బాయికి ఇంజనీరింగ్‌లో సీటొచ్చింది. డబ్బు కావాలి.

ప్రక్క మెకానిక్ షెడ్ బాబాయిగారు తరుణోపాయం చెప్పనే చెప్పారు.

"మీ ఇల్లిప్పుడు బంగారం సార్! అప్పుడు మీ నాన్నగారెంతకి కొన్నారో గానీ ఇప్పుడు గజం ఇక్కడ అయిదువేలు దాటిపోయింది. ఎంత కాదన్నా పదహారు, పదిహేడు లక్షలు చేస్తుంది స్థలం. ఆ పాతింటిని పట్టుకుని ఇంకా ఏం వేళ్ళాడుతారు" అని చెవిలో చెప్పేశాడు.

ఇల్లమ్మి వాటాలేశారు. రమణకి నాలుగు లక్షలొచ్చాయి. "పోన్లే పిల్లల చదువులకి పనికొస్తాయి. బ్యాంక్‌లో వేసెయ్ రమణా!" అన్నాను.

డబ్బు చేతిలో పడిన నెల తిరక్కుండా కొత్త అపార్ట్‌మెంటు అద్దెకి కుదిర్చాడు. "అమ్మో ఇంతిల్లు మనకెందుకు? అంత అద్దె మనం ఎక్కడ ఇస్తాం?" అంటే ఒక నవ్వు నవ్వేశాడు. అన్నింటికీ 'ప్లీడరమ్మా నీ ఉద్దేశ్యం ఏమిటి?' అనేవాడు. ఇప్పుడు అడగడం మానేశాడు.

అపార్ట్‌మెంట్‌లోకి మారాక వరసవరసగా ఒక్కొక్కటే కొనేసి ఇల్లు నింపేశాడు. నాకొక గాజుల జత కూడా కొన్నాడు.

"నీ గాజులతోనేగా ఇల్లు బాగు చేసుకున్నాం. నీ చేతులకి బంగారు గాజులు లేక పోవడం నాకు బాగుండదు" అన్నాడు.

"సారీ రమణా! నేను ఇంక బంగారం గాజులు వేసుకోను. మానేశాను" అంటే

"పోన్లే కాంతికుంచు" అన్నాడు ఆరిందలాగా.

అయిపోయింది. రమణ మారిపోయాడు. ఈమధ్య వింత వింత వ్యాఖ్యానాలు, వెక్కిరింపులు కూడా మొదలుపెట్టాడు. వుండి వుండీ ఒకనాడు బాంబు పేల్చేశాడు.

"ఈ ఇల్లు నేను కొంటున్నాను. రెండున్నర లక్షలు అడ్వాన్స్ ఇచ్చేశాను. మిగతాది బ్యాంక్‌లోన్ పెట్టేశాను. నెలకి మూడువేలు కట్టాల్సొస్తుంది" అనేశాడు.

"నాకు చెప్పకుండా ఎందుకు చేశావిలా?"

"చెబితే నీ బుర్రకి ఎక్కదు. ఆ లలితతో స్నేహం చేశాక నీకు ఉన్న మతికాస్తా పోయింది"

"ఎలా కడతావూ నెలకి మూడువేలు"

"అన్ని ఏర్పాట్లు చేసేశాను. ఇక నుంచి నీ ప్లీడరీ పనికి స్వస్తి చెప్పి మన సుబ్బారావు కొత్తగా పెట్టిన రెసిడెన్షియల్ కాలేజీలో చేరిపో. నెలకి పదివేలిస్తానన్నాడు. మూడువేలు బ్యాంక్‌కికట్టు. మిగతాది దాచేసుకో. నీ యిష్టం.

"అదేమిటి! నాకీ పని నచ్చిందని కదా చేస్తున్నాను."

"అన్నీ మనకి నచ్చిన పన్లే చెయ్యలేం తల్లీ! ఇది జీవితం. ఇక్కడ ప్రాక్టికల్‌గా ఆలోచించాలి. నీ శక్తిసామర్థ్యాలన్నీ ఓడిపోయే కేసులకి ధారపోస్తావు. ఏమిటి లాభం. అందువలన ఒక రేపిస్ట్‌కి శిక్ష వేయించావా? రోజా మొగుణ్ణి జైల్లో పెట్టించగలిగావా? చెప్పు"

"అయితే కేసులు గెలవని ప్లీడర్లంతా ఆ వృత్తికి స్వస్తి చెప్పి వేరే పన్లు చేసుకోవాలా?"

"అందరి సంగతి మనకనవసరం. రేపు నీ కొడుక్కి చదువు కొనాలి. నీ కూతురికి మొగుణ్ణి కొనాలి. నిన్ను దేశసేవకి వదిలి భారం అంతా నా నెత్తి కెత్తుకోవడానికి నేను మీ

అమ్మమ్మని కాను. ఆలోచించు. ఏం చేస్తావో. బోలెడు ఇంటెలిజెన్స్ కన్నా పిసరంత కామన్‌సెన్స్ ముఖ్యం.”

కామన్‌సెన్స్ వర్ధిల్లు గాక!

పోనీ, పోతేపోనీ. సుశీలని, ప్రియంవదని, ఇంకో ఝాన్సీని. మన కల మన పిల్లల్ని చదివించుకుని, మన ఇల్లు దిద్దుకుని మిగతా కాలం టి.విని చూసేద్దాం. మన బ్రతుకు మనకోసం. ఇలాగే కదా నిరుడిదాకా చేయూతలో పనిచేసిన ఇందిర బ్యూటీపార్లర్ తెరిచింది. వాళ్ళాయన పెద్ద ఉద్యోగం చేస్తున్నా సౌందర్య చీరెల బిజినెస్ పెట్టింది. వాళ్ళబ్బాయిని ఆస్ట్రేలియా పంపించింది. ఉదాహరణలు కోకొల్లలు. తెలివిగల కామన్‌సెన్స్ గల స్త్రీలు. గుండె గడియారంలా కొట్టుకుంటోంది. గడియారం ముళ్ళు కదలడం మానేశాయి. రాత్రి దీర్ఘమైపోయింది.

ఎచటికి పోతావీ రాత్రి?

“ఎంత దీర్ఘమైన రాత్రయినా తెల్లవారక తప్పదు కదా! అంటూ వెలుగు కిరణాలు కిటికీల్లో నుంచీ చొరబడి వచ్చి కళ్ళని తాకుతున్నాయి.మెత్తగా, చురుగ్గా, ఓదార్పుగా. తెల్ల వారడం అంటే తేల్చి చెప్పడం. చావో, బ్రతుకో!

వంట ఇంట్లో చప్పుళ్లు. రమణ కాఫీ కలుపుకుంటున్న వాసన. ఎదురుగా కప్పుతో వచ్చి నిలబడ్డాడు. కళ్ళనిండా ధీమా, ఆత్మవిశ్వాసం. మంచం మీద నుంచి లేచి నిటారుగా నిలబడి అతని కళ్ళల్లోకి సూటిగా చూసి పళ్ళు తోముకోడానికి వెళ్ళాను.

పాపం రమణ !

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 26 డిసెంబర్ 1999*